హమ్మయ్య... ఎండొచ్చింది!

28 మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):వారం రోజులుగా వరుస వర్షాలతో ఇబ్బందులు పడ్డ జనం బుధవారం ఉదయం ఎండ కాయడంతో ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి మొంథా తుఫాను తీరం దాటడంతో వర్షాలు కురుస్తాయోమోనన్న అంచనాతో వున్న ప్రజలు ఆ వాతావరణమే కన్పించకపోవడంతో రోజువారీ పనుల్లో గడిపారు.కాగా గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా నాలుగు మండలాలు మినహా 28 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా కార్వేటినగరం మండలంలో 16 మిమీ, అత్యల్పంగా వి.కోట మండలంలో 0.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా రొంపిచెర్లలో 14.8, విజయపురంలో 14, నగరిలో 13, శ్రీరంగరాజపురంలో 12.6, పులిచెర్లలో 12.2, నింద్రలో 11.6, పూతలపట్టులో 10.4, పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో 9.8, వెదురుకుప్పంలో 9.4, తవణంపల్లెలో 9.2, సదుంలో 9.0, యాదమరిలో 7.4, గుడిపాలలో 5.6, గంగాధరనెల్లూరు, పెద్దపంజాణి, సోమల మండలాల్లో 5.2, చిత్తూరు రూరల్‌లో 4.6, చౌడేపల్లెలో 4.2, గంగవరంలో 3.6, బంగారుపాళ్యం, చిత్తూరు అర్బన్, పలమనేరు మండలాల్లో 3.4, బైరాలలో 3.2, పుంగనూరులో 2.2, బైరెడ్డిపల్లెలో 1.2 మిమీ వర్షం కురిసింది.

పోలిలో 50 ఎకరాల్లో సోలార్ ప్లాంట్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలంలోని పోలి గ్రామంలో 58ఎకరాల్లో సోలార్ ప్లాంట్‌కు భూమి కేటాయించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. జిల్లా సౌర విద్యుత్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకుజిల్లాలో 25మెగా వాట్ల సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని అందులో భాగంగా మోహన్ స్పిన్‌టెక్స్ కంపెనీకి పనులు అప్పగించామన్నారు. 25మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకోసం పోలి గ్రామంలో భూమి మంజూరు చేసినట్లు తెలిపారు.



ఆకాశం ఎందుకో ఎర్రబడ్డదీ...

ముసురు వెలిసింది. సూర్యుడు తొంగిచూశాడు. వరుస వానలకు తడిచి ముద్దయిన చెట్టూ చేమా పుట్టా గుట్టా తళతళలీనాయి. కన్నుకుట్టిన మబ్బులు నింగితో దోబూచులాడాయి. ప్రకృతికన్య సిగ్గులమొగ్గై ఎర్రబారింది. చిత్తూరు గంగినేని చెరువు వద్ద బుధవారం సాయంత్రం కనిపించిన దృశ్యం ఇది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, చిత్తూరు ఆంధ్రజ్యోతి

514 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



ఎస్‌ఆర్ పురం మండలంలో వరి పంట నష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మురళీకృష్ణ, సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా జిల్లాలో 13 మండలాల్లోని 83 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి.వీటిలో 362మంది రైతులు 514 ఎకరాల్లో సాగు చేసిన వరి, వేరుశనగ, ఉద్యాన పంటలు వున్నాయి. ఇందులో 334 మంది రైతులు 475 ఎకరాల్లో సాగు చేసిన వరి, వేరుశనగ పంటలుండగా, సదుం, చౌడేపల్లె, సోమల, పుంగనూరు, గంగవరం, చిత్తూరు మండలాల్లోని 28 మంది రైతులు 39 ఎకరాల్లో సాగు చేసిన బొప్పాయి, టమోటా, పొద్దుతిరుగుడు, పువ్వుల పంటలు దెబ్బతిన్నాయి. జీడీ నెల్లూరు మండలంలోని రెండు గ్రామాల్లో 10.6 ఎకరాలు, సోమల మండలంలోని ఓ గ్రామంలో 5 ఎకరాలు, తవణంపల్లె మండలంలోని 4 గ్రామాల్లో 6.5 ఎకరాలు, వెదురుకుప్పం మండలంలోని 8 గ్రామాల్లో 38.25 ఎకరాలు, ఎస్‌ఆర్‌పురం మండలంలోని ఓ గ్రామంలో 2 ఎకరాలు, పూతలపట్టు మండలంలోని 12 గ్రామాల్లో 37.5 ఎకరాలు, పెనుమూరు మండలంలో 146 ఎకరాలు, యాదమరి మండలంలోని 9గ్రామాల్లో 14.25 ఎకరాలు, గుడిపాల మండలంలోని 15 గ్రామాల్లో 162.5 ఎకరాల వరి పైరు దెబ్బతింది. సదుంమండలంలోని ఓ గ్రామంలో ఎకరా, బంగారుపాళ్యం మండలంలోని 7 గ్రామాల్లో 21.5 ఎకరాలు, బైరాల మండలంలోని 8 గ్రామాల్లో 28 ఎకరాలు, పాలసముద్రం మండలంలోని మూడు గ్రామాల్లో 3.5 ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది.



నగరి మండల పరిధిలో మొరవ పారుతున్న ఓయూ కుప్పం చెరువు

తెగిన 55 చెరువులు

దెబ్బతిన్న రహదారులు 25 ● రూ.2.50 కోట్ల నిధులతో తాత్కాలిక మరమ్మతులు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పాడైన రహదారులకు, కల్వర్టులకు, చెరువులకు తాత్కాలిక మరమ్మతు పనులను ప్రభుత్వం విడుదల చేసిన రూ.2.50 కోట్ల నిధులతో చేపడతామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వరదల కారణంగా 55 చెరువులు తెగిపోగా, 25 రహదారులు దెబ్బతిన్నాయన్నారు. వీటి శాశ్వత పునరుద్ధరణ పనులకు ఒక్కో పనికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.కోటి మేర నిధులు కావాల్సి వస్తుందని చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు పనులను చేయించి వేరే మార్గాల ద్వారా తర్వాత శాశ్వత పనులు చేపడతామన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఎస్‌ఈలతో సమావేశం నిర్వహించి 20 రోజుల్లోగా తాత్కాలిక మరమ్మతు పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు.వర్షాల కారణంగా 32 మండలాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువులు 75 శాతం నిండగా, భూగర్భ జలమట్టం పెరిగి 12 టీఎంసీల నీరు వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు సైతం చెరువుల నుంచి నీరు వృథాగా పోనివ్వకుండా కాపాడుకుంటూ భూగర్భజలమట్టం పెంచాలని సూచించారన్నారు.గుడుపల్లె, వి.కోట మండలాల్లో మాత్రం చెరువుల్లో నీరు చేరినా, భూగర్భ జలమట్టం తక్కువగా ఉందన్నారు. వంద ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారని, వర్షాలు ఆగిపోయిన దృష్ట్యా క్షేత్రస్థాయిలో వెళ్ళి ఖచ్చితమైన నష్ట వివరాలను సేకరిస్తామన్నారు. కుప్పంలో ఓ పారిశుధ్య కార్మికుడు మృతిచెందగా, గుడిపాల తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్లు కాలిపోయాయని, పలు ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడలు కూలినట్లు నివేదికలు అందాయని చెప్పారు.

5 లోగా నష్టపరిహార నివేదికలు

● సిద్ధం చేయాలన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ద్వారా జిల్లాలో జరిగిన నష్టాలపై వచ్చేనెల 5వ తేదీలోగా నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి జిల్లా అధికారులతో నష్టగణన ప్రక్రియ అంశంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.తుఫాను బాధితులకు పరిహారం అందించే విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. విద్యుత్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు నష్టాల సమగ్ర నివేదికను డీఆర్వోకు అందించాలన్నారు.డీఆర్వో మోహన్‌కుమార్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా కూలిన, దెబ్బతిన్న గృహాల గూర్చి తప్పుల్లేకుండా నివేదికలు ఇవ్వాలని, దెబ్బతిన్న కల్వర్టుల వివరాలను ఆర్ అండ్ బీ అధికారులు నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు.ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు మండలాలవారీగా నష్టాల అంచనా నివేదికలు సిద్ధం చేయాలని చెప్పారు.



యంత్రాంగం పనితీరు భేష్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహకరించినందువల్లే మొంథా తుపాను ప్రభావంతో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టాలు జరగలేదని జిల్లా ప్రత్యేక అధికారి పీఎస్ గిరీషా అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ రెండురోజులు గంగాధరనెల్లూరు, నగరి మండలాల్లో తుఫాను పరిస్థితి ఎదుర్కొనేందుకై అధికారులు చేపట్టిన పనులను పర్యవేక్షించానన్నారు. తీరం దాటడంతో జిల్లాకు తుఫాను ముప్పు తప్పిందని చెబుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేశారని కితాబిచ్చారు. నష్టాలపై ప్రాథమిక నివేదిక అంచనాలను ప్రభుత్వానికి కలెక్టర్ త్వరలో పంపిస్తారన్నారు. నగరి వద్ద ఓ ప్రాంతంలో ఆక్రమణలు ఉన్నాయని, వాటిని తొలగిస్తే కిందిభాగంలోని చెరువుల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందని చెబుతూ, తగు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.



ఎస్వీ గిరీషా

తేలని మదనపల్లె జిల్లా

రెవెన్యూ డివిజన్‌గా పుంగనూరు ● అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేట

● ప్రతిపాదించిన మంత్రివర్గ ఉపసంఘం ● సొంత జిల్లా కావడంతో తుది నిర్ణయం సీఎందే

చిత్తూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):మదనపల్లెను జిల్లా కేంద్రం చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించింది. సీఎం చంద్రబాబు కూడా ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి వుండడంతో ఏర్పాటు ఇక లాంఛనమే అనుకున్నా మళ్లీ తర్జనభర్జన జరుగుతోంది. ఏర్పాటు చేస్తే రాజకీయంగా ఎలాంటి లాభనష్టాలుంటాయనే కోణంలో టీడీపీ అధిష్ఠానం ఆలోచిస్తోంది.ఈ విషయంపై సీఎం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.అలాగే పుంగనూరు నియోజకవర్గాన్ని మదనపల్లె రెవెన్యూ డివిజనులో కలపాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుని, పుంగనూరు కేంద్రంగా కొత్త రెవెన్యూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. చిత్తూరు జిల్లాలో ఉన్న నగరి నియోజకవర్గంలోని నగరి,విజయపురం,నింద్ర మండలాలను కూడా తిరుపతి జిల్లాలో కలిపేయనున్నారు.వైసీపీ అసంబద్ధంగా చేసిన జిల్లాల పునర్విభజనను కూటమి ప్రభుత్వం సరిచేయాలని భావిస్తోంది. పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికన కాకుండా ప్రజల ఆకాంక్షలు, ఆయా ప్రాంతాలు జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండడం వంటివాటిని ప్రామాణికంగా తీసుకుంది. ఈ క్రమంలో ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయగా, మంగళవారం ఆ సంఘం తన తుది నివేదికను సీఎం చంద్రబాబుకు అందించింది. సీఎం సూచనల మేరకు బుధవారం సంఘం మరోసారి సమావేశమైంది. పూర్తిస్థాయి క్లారిటీ కోసం సోమవారం ఇంకోసారి కూడా సమావేశం కానుంది.

ఇక పుంగనూరుకు విడిగా ఆర్డీవో

పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాలను విభజించిన వైసీపీ, రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరును మాత్రం పెద్దిరెడ్డి కోసం చిత్తూరు జిల్లాలో ఉంచేసింది. దీన్ని మదనపల్లె రెవెన్యూ డివిజనులో కలిపేందుకు ఈ ఏడాది మే నెలలో ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. నెల తర్వాత తుది నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉండగా, దానిపై నిర్ణయం తీసుకోలేదు. తాజాగా మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు మేరకు పుంగనూరునే రెవెన్యూ డివిజన్ చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలోని పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు చిత్తూరు, మిగిలిన నాలుగు మండలాలు పలమనేరు రెవెన్యూ డివిజనులో ఉన్నాయి. ఒక నియోజకవర్గం ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనేది ప్రామాణికంగా తీసుకోవడంతో ఇక ఆరు మండలాలూ పుంగనూరులో ఉండనున్నాయి.



కొత్తగా రెండు రెవెన్యూ డివిజన్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొత్తగా రెండు రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయనున్నారు. చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరు, చిత్తూరు, నగరి కేంద్రాలు ఉండగా, తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు కేంద్రాలున్నాయి. విభజన తర్వాత గూడూరు కేంద్రం నెల్లూరు జిల్లాలోకి వెళ్లిపోనుండగా, నగరి కేంద్రం తిరుపతిలో కలవనుంది. పుంగనూరు డివిజన్ ఏర్పాటు ఇప్పటికే కన్ఫర్మ్ అవ్వగా, రెండో కేంద్రం పీలేరులో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. రెవెన్యూ డివిజన్లతో పాటు మండలాలను కూడా పెంచనున్నారు.

నగరిలోని మూడు మండలాలూ తిరుపతిలోకే..

నగరి నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం రెండు జిల్లాల నడుమ విభజించి అసౌకర్యానికి, అయోమయానికి కారణమైంది. నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో కొనసాగించిన గత ప్రభుత్వం మిగిలిన పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో కలిపింది. ఇది పాలనాపరమైన సమస్యలకు దారి తీసింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నియోజకవర్గం మొత్తాన్నీ తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు కలెక్టర్ సుమిత్ కుమార్ సైతం నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరు నుంచీ తొలగించి తిరుపతి జిల్లాలోనే కలపాలని సిఫారసు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయాన్ని, చిత్తూరు కలెక్టర్ నివేదికను దృష్టిలో వుంచుకుని చూస్తే మంత్రివర్గ ఉపసంఘం నగరిని పూర్తిగా తిరుపతిలో కలిపే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదించాల్సి వుంది. కాకపోతే దీనిపైనా ఇప్పటి దాకా ఒక నిర్ణయం తీసుకోలేదు.వైసీపీ హయాంలో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేసేటప్పుడు రాయచోటిని జిల్లా కేంద్రం చేశారు. జిల్లాకు అన్నమయ్య పేరు పెట్టారు. కానీ, ఇప్పుడు జిల్లా కేంద్రం రాయచోటి నుంచి రాజంపేటకు మార్చేందుకు నిర్ణయించారు. అంటే, కలెక్టర్, ఎస్పీ వంటి అన్నిశాఖల జిల్లా కార్యాలయాలూ రాజంపేటకు తరలనున్నాయి.

కలెక్టర్ నుంచి మరోసారి నివేదిక

రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజన వంటి అంశాల గురించి ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక అందించారు. పుంగనూరు, నగరి అంశాలను చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇదివరకే నివేదించగా.. మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి మార్పుల గురించి తుది నివేదిక ఇవ్వాలని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నుంచి బుధవారం కలెక్టర్లకు మెయిల్ వచ్చింది.

ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌కు తుది పరీక్షలు

సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో భారీ ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో శక్తిమంతమైన ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిన ఇస్రో తాజాగా 4,410 కిలోల బరువు కలిగిన మల్టీబ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. నవంబరు 2న సాయంత్రం 5.26 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3-ఎం5 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. ప్రయోగ వేదికపై ఉన్న రాకెట్‌కు బుధవారం శాస్త్రవేత్తలు తుది పరీక్షలు నిర్వహించి ప్రయోగానికి సిద్ధం చేస్తున్నారు. ప్రయోగానికి సంబంధించిన ఎంఆర్ఆర్ సమావేశం ఈ నెల 31న షార్‌లో జరగనుంది. అదేరోజు మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో కౌంట్‌డౌన్ సమయం అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం ఇస్రో వర్గాల సమాచారం మేరకు కౌంట్‌డౌన్‌ను 24 గంటల ముందు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇస్రో అత్యంత బరువైన ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఇదే ప్రథమం. భారత్ సహా విశాలమైన సముద్ర ప్రాంతంలో కమ్యూనికేషన్ సేవలు అందించడం కోసం ఈ ఉపగ్రహాన్ని మన శాస్త్రవేత్తలు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి ప్రయోగిస్తున్నారు. రాకెట్ ప్రయోగం 16 నిమిషాల్లో పూర్తయ్యేలా డిజైన్ చేశారు.



రెండో ప్రయోగ వేదికపై విద్యుత్ వెలుగుల్లో ఎల్వీఎం3-ఎం5 రాకెట్



సీఆర్ నాయుడు
(ఫైల్ ఫొటో)

సీనియర్ జర్నలిస్టు సీఆర్ నాయుడు కన్నుమూత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):సీనియర్ జర్నలిస్టు చెరుకూరి రంగయ్య నాయుడు అలియాస్ సీఆర్ నాయుడు (82) బుధవారం కన్నుమూశారు.వయోభారంతో,అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా హైదరాబాదులో చికిత్స పొందుతున్న ఆయన బీరంగూడ లోని కుమార్తె హిమబిందు నివాసంలో తుదిశ్వాస విడిచారు. పాకాల పట్టణం కమతంపల్లెకు చెందిన సీఆర్ నాయుడు ఆంధ్రప్రభ, ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఉదయం, వార్త దినపత్రికల్లో తిరుపతి, బెంగళూరు, చెన్నై కేంద్రాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.గురువారం ఉదయం 10గంటలకు బీరంగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఘాట్‌రోడ్డులో బైకుల ఢీ

ఇద్దరికి గాయాలు

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో బుధవారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. తిరుపతికి చెందిన చంద్రమౌళి బైక్‌లో తిరుమలకు వెళ్తుండగా ఆ ప్రాంతంలో పనులు చేసే కార్మికుడు జితేంద్ర బైక్‌పై ఎదురొచ్చాడు. రెండు బైక్‌లూ ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. భద్రతాసిబ్బంది వారిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అలిపిరి నుంచి వినాయకుడి గుడిదాకా డబుల్ రోడ్డు ఉంటుంది. తిరుమలకు వెళ్లే వైపున కాకుండా మరోవైపున చంద్రమౌళి ప్రయాణిస్తుండగా అదే మార్గంలో ఎదురొచ్చిన బైక్‌ను ఢీకొన్నాడు.

→ ఘటనా ప్రాంతంలో గాయాలతో జితేంద్ర, చంద్రమౌళి

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.57 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,250

తలనీలాలు సమర్పించినవారు: 25,250





చినుకుల్లో రోడ్లు ఊడుస్తున్న పారిశుధ్య కార్మికులు

తుఫానే తలవంచింది!

ఎడతెరిపి లేని వాన.. ఈడ్చికొడుతున్న ఈదురుగాలులు, వణికిస్తున్న చలి.. ఇటువంటి వాతావరణంలోనూ తిరుమలలో పారిశుధ్య కార్మికులు తమ విధులు యథాతథంగా నిర్వహిస్తున్నారు. పలుచని పాలిథిన్ రెయిన్‌కోట్‌లు ధరించి పనులు చేస్తూ కనిపిస్తున్నారు. ఆలయపరిసరాలు, కాటేజీలున్న ప్రాంతాల్లోనే కాకుండా, నడక దారులు, వేదపాఠశాల, శ్రీవారి పాదాలు మార్గం, పాపవినాశనం మార్గంలోనూ బుధవారం కార్మికులు పనులు చేస్తూ కనిపించారు. టీటీడీ హెల్త్ విభాగంలో 2,152 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. మూడు షిఫ్టుల్లో వీరు విధులు నిర్వహిస్తుంటారు. తిరుమల పరిశుభ్రత, అందం వీరి శ్రమ సౌందర్య ఫలితమే! మొంథా తుపాను వానలు వీరి విధినిర్వహణ ముందు తలవంచక తప్పలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కాలిబాట మార్గాలను శుభ్రపరుస్తున్న కార్మికులు

917 హెక్టార్లలో పంట నష్టం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో 917 హెక్టార్లలో పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభ దశలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, మొంథా తుపాన్ తీవ్ర ప్రభావం చూపించాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు వరి నాట్లు వేశారన్నారు. విస్తారంగా కురిసిన వర్షాలకు 917 హెక్టార్ల మేర పైరు నీట మునిగిందన్నారు. పొలాల్లో నీరు బయటకుపోయిన తర్వాత పూర్తి నష్టాన్ని అంచనా వేయగలమన్నారు.

రక్తమోడుతున్న రైలు పట్టాలు

● ఐదేళ్లలో 436 మంది మృత్యువాత ● ప్రమాదాలు కొన్ని.. బలవన్మరణాలు మరికొన్ని



రైలు పట్టాలపై పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్ ఫొటో)

తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి.. తిరుపతి వెస్ట్ స్టేషన్ వరకు 12 కిలోమీటర్లు. ఈ మధ్యలో.. ఐదేళ్లలో దాదాపు 436 మంది రైలు పట్టాలపై ప్రాణాలు కోల్పోయారు. ఆందోళన కలిగించే గణాంకాలివీ. ఈ మృతుల్లో.. రైళ్ల నుంచి జారిపడిన వారు, పట్టాలు దాటే సమయంలో రైళ్లు ఢీకొనడం, ఆత్మహత్యలు చేసుకున్న వారున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఐదేళ్లలో మృతిచెందింది: 436 మంది

రైలు నుంచి జారిపడిన ఘటనల్లో: 130 మంది

పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొనడంతో చనిపోయింది: 65 మంది

పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకుంది: 210 మంది

గుర్తు తెలియని వారు: మరో 31 మంది

● రెండు రోజుల క్రితం తిరుపతి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నెంబరు 5లో తిరుపతి-కొల్హాపూర్ వెళ్లే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ కదులుతుండగా 45 ఏళ్ల వ్యక్తి రైలు ఎక్కుతున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి రైలుకు, ప్లాట్‌ఫారానికి మధ్యలో పడి శరీరం రెండు ముక్కలై మృతి చెందాడు.

● తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్ మధ్య రిలయన్స్ అండర్ బ్రిడ్జి సమీపంలో 50 సంవత్సరాల వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

ఈ రెండూ మచ్చుకు ఉదాహరణలే. తిరుచానూరు.. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ మధ్య తరచూ ఎక్కడో ఒక చోట రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఉంటున్న జనరల్ బోగీల్లో ఫుట్‌పాత్‌పై ప్రమాదకర పరిస్థితుల్లో కూర్చున్న వారిలో పలువురు ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందుతున్నారు. ఇంకొందరు ప్రయాణికులు పట్టాలు దాటే సమయంలో.. రైలు దగ్గరకు వచ్చే సరికి వెళ్లిపోవచ్చని అనుకుంటారు. ఇలా పలువురు ప్రమాదకర పరిస్థితుల్లో పట్టాలు దాటుతూ మృతి చెందుతున్నారు. పూర్ణకుంభం సమీపంలోని రైల్ ఓవర్ బ్రిడ్జి వద్ద.. అటు పద్మావతి మహిళా వర్సిటీ సమీపంలో.. మరోవైపు స్టేషన్‌లో రైలు షంటింగ్ చేసే సమయంలో ఎక్కువగా చనిపోతున్నారు. ప్రతి నెలా సగటున 5 నుంచి 8 మంది వివిధ కారణాలతో మృత్యువాత పడుతున్నారు. ఇలా ఐదేళ్లలో 436 మంది చనిపోగా.. వీరిలో 31 మంది గుర్తు తెలియని వ్యక్తులే. వీరి వివరాలు తెలియక అనాధ శవాలుగా ఖననం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

రైలు ప్రమాదాల నివారణలో భాగంగా రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు, సంయుక్తంగా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. రైలు వచ్చే సమయంలో మైకు ద్వారా అప్రమత్తం చేస్తున్నాం.

- ఆశీర్వాదం, రైల్వే సీఐ

తిరుపతి మాజీ డీసీపై సస్పెన్షన్ ఎత్తివేత

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ కమిషనర్ పి.చంద్రమౌళీశ్వరరెడ్డిపై సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అయితే శాఖాపరమైన విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. విచారణను ప్రభావితం చేసే వీలు లేకుండా దూరంగా బదిలీ చేయాలని ఆదేశించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన పి.చంద్రమౌళీశ్వర్ రెడ్డి 2021 నాటి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. అప్పట్లో ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు తనకు తానే ఈఆర్వోగా వ్యవహరించారనేది ప్రధాన ఫిర్యాదు. ఆ హోదాలో ఎలాంటి క్లైమ్ ఫారాలూ లేకుండానే ఓటరు ఐడీ కార్డులను వేల సంఖ్యలో డౌన్‌లోడ్ చేశారనేది మరో ఆరోపణ. వీటిని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల కమిషన్ విచారణకు ఆదేశించింది. దీంతో పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాటి దర్యాప్తునకు సిట్ కూడా ఏర్పాటైంది. ప్రాథమిక విచారణలో చంద్రమౌళీశ్వరరెడ్డి ఈసీ నోటిఫికేషన్ జారీ చేయకుండానే తనకు తానుగా తిరుపతి సెగ్మెంట్‌కు ఈఆర్వోగా ఎన్నికల్లో విధులు నిర్వర్తించినట్టు తేలింది. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఈసీ ఆదేశించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 9న చంద్రమౌళీశ్వరరెడ్డిని సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ ఎత్తివేసే విషయమై గతేడాది సెప్టెంబరు 27న, ఈ ఏడాది ఏప్రిల్ 25న రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల కమిటీ సమీక్షించినప్పటికీ ఆయనపై వచ్చిన ఆరోపణల తీవ్రత దృష్ట్యా కొనసాగించాలని నిర్ణయించింది. ఏడాది దాటినా తనపై సస్పెన్షన్ ఎత్తివేయలేదని, తనను తిరిగి సర్వీసులోకి తీసుకోలేదని చంద్రమౌళీశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్ (నంబరు 16450-2025)పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఆ క్రమంలో ఆగస్టు 21న ఉన్నతాదికారుల కమిటీ మరోసారి సమావేశమై చంద్రమౌళీశ్వరరెడ్డి సస్పెన్షన్‌పై సమీక్షించింది. విచారణ కొనసాగిస్తూనే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నిర్ణయించింది. ఆయనను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీ సిఫారసులను ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు నివేదించగా ఈసీ కూడా అంగీకరించింది. దీంతో చంద్రమౌళీశ్వర్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విచారణను ప్రభావితం చేయకుండా ఆతడిని తిరుపతికి సుదూరంగా బదిలీ చేయాలని, నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలని ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్యేక ఫీజు సీట్లకు అడ్మిషన్లు

◆ ఎస్వీయూలో ఇంజనీరింగ్, ఫార్మసీలో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రత్యేక ఫీజుతో అడ్మిషన్లకు అనుమతించారు. ఈమేరకు ఎంటెక్, ఎంఫార్మసీ, బీఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు అవకాశమేర్పడింది. అర్హత,ఆసక్తి ఉన్న విద్యార్థులు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ప్రకటనలో తెలిపారు. ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్-2025 మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ -2025 రెండవ ప్రాధాన్యత, బీటెక్ వారికి చివరి ప్రాధాన్యతలో అడ్మిషన్లు ఇస్తారు. ఎంఫార్మసీలో చేరడానికి జీ ప్యాట్-2025 వారికి మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్-2025 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, బీఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇస్తారన్నారు. బీఫార్మసీలో చేరడానికి ఏపీ ఈసెట్-2025 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులకు చివరి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంటెక్ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1,45,170, ఎంఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1, 53,940, బీ ఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ.81 వేలుగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. 'ఎస్వీయూనివర్సిటీ.ఎ డ్యూ.ఇన్.డీవోఏ' వెబ్‌సైట్‌లో చూడాలని ఆ ప్రకటనలో సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సందర్భంగా బుధవారం రిజర్వుడ్ గ్రౌండులో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం పోలీసు శాఖ ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరమైన సాంకేతిక వ్యవస్థలను వారు ఆసక్తిగా తిలకించారు. అమరవీరుల త్యాగాలకు వారు నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశ భక్తి, సేవాస్ఫూర్తిలను పెంపొందించడం పోటీల ఉద్దేశమని చెప్పారు. అమర వీరుల త్యాగాలను భావి తరాలకు తెలియచేయడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత, సీఐ తమీమ్ అహ్మద్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడి రైల్వేలైన్‌కు 6.5 ఎకరాలు గుర్తించాం

● అమ్మవారిపట్టెడలో రైతులతో ఆర్డీవో సమావేశం



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

రేణిగుంట అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి):పూడి రైల్వే లైన్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి సమావేశమయ్యారు. బుధవారం మండల పరిధిలోని అమ్మవారి పట్టెడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పూడి రైల్వే లైన్ నిర్మాణానికి గ్రామంలోని రైతులకు చెందిన 6.5 ఎకరాలను గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన 29 రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీటీ శ్యాం ప్రసాద్, ఆర్ఐ జైకృష్ణ, సర్వేయర్ సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.





వసంత మండపంలో మన్ను సేకరిస్తూ.. - విష్వక్సేనుడికి హారతులిస్తున్న అర్చకులు

పుష్పయాగానికి అంకురార్పణ

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం జరగనున్న పుష్పయాగానికి బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు ముందు ఆచార్య ఋత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే ఋత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణకోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు. ఇక, రాత్రి 7 గంటలకు శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడిని ఆలయం నుంచి వసంతమండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. 8 నుంచి 9 గంటల నడుమ ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ జరిగింది.

నేడు పుష్పయాగం: శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు కల్యాణమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు రకాల పత్రాలు, 12 రకాల పుష్పాలతో (సుమారు 9 టన్నులు) ఉత్సవర్లకు పుష్పయాగం నిర్వహిస్తారు.

రైతుల పరిస్థితి దయనీయం

● ముక్కంటి ఆలయంలో అవినీతి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో పరిశ్రమలకు కల్పిస్తున్న సదుపాయాలను రైతులకు ఇవ్వడం లేదని దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 11 ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం రైతులకు చేసింది శూన్యమన్నారు. యూపీయే హయాంలో రూ.70వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అదానీకి భూములు, విమానాశ్రయాలు ఇస్తారు కానీ రైతులకు ఏం ఇచ్చారని ప్రశ్నించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.22వేల కోట్లు రాయితీ ఇచ్చారని, రైతు బిడ్డ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు ఏం చేశారన్నారు. యూపీఏ హయాంలో శ్రీసిటీ, మేనకూరు సెజ్, కృష్ణపట్నం పోర్టు తెచ్చామన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు రూ.14.50 లక్షల కోట్ల రుణమాఫీ చేశాయని, ఎవరికి ఎంత మాఫీ చేశారో ప్రధాని మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్, సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. తమ హయాంలో మన్నవరంలో బెల్ పరిశ్రమకు పునాదిరాయి వేయగా నేడు అనాది రాయిగా మిగిలిందన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెప్పులు, సెల్‌ఫోన్ స్టాండ్, కారు పార్కింగ్‌లో అవినీతి చోటు చేసుకుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 20 వేల ఎకరాల భూములను స్వాహా చేశారని సీఎం, కలెక్టర్ జోక్యం చేసుకుని ఆక్రమణలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, సమీవుల్లా, రవి, జనార్దన రెడ్డి, శివయ్య, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ విధుల్లో అలసత్వం..

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

తడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ విధుల్లో అలసత్వం వహించిన మరో పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ అయ్యింది. సోమవారం రాత్రి కారూరు సచివాలయ పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు తుపాన్ విధులు నిర్వహించడంలో అలసత్వం వహించారని అధికారుల పరిశీలనలో తేలింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ తహసీల్దారు శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కాగా, ఇప్పటికే పెరియవట్టు, పూడి, అండగుండాల, సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

డీ-ఎడిక్షన్ కేంద్ర విస్తరణ యోచన

● పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవికృష్ణ

తిరుపతి(వైద్యం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని మత్తు వ్యసన నిర్మూలన కేంద్రాన్ని(డీ-ఎడిక్షన్ కేంద్రం) 60 పడకలతో విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఏరవికృష్ణ చెప్పారు. ఈ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ తిరుపతితోపాటు విశాఖపట్నం, కర్నూలు జిల్లాల్లోని కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తున్నామన్నారు. మత్తు వ్యసనాల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రలను బాధితులు వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురితో ఆయన మాట్లాడారు. సదుపాయాల గురించి ఆరా తీశారు. చికిత్సా విధానాలను పరిశీలించారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలను చాలా వరకు అరికట్టామని ఐజీ చెప్పారు. విద్యార్థులకు,యువతకు అవగాహన కల్పించి గంజాయి జోలికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇక్కడి కేంద్రంలో అందిస్తున్న చికిత్సలు, కౌన్సెలింగ్ పద్ధతుల గురించి ఎస్పీ సుబ్బరాయుడు ఆయనకు వివరించారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ రాధ, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఏఆర్ఎంవో హరికృష్ణ, డిఐవో హరిప్రసాద్, మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం విభాగాధిపతి డాక్టర్ పద్మావతి, మెడికల్ ఆఫీసర్ మానస, కౌన్సలర్లు మురళీ, ఈగల్ టీం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగుల వివరాలు పరిశీలిస్తున్న ఐజీ రవికృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు మంగళం డిపో మేనేజర్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, పంచరామారాలు, మొగిలి, శ్రీకాళహస్తి, తిరువణ్ణామలై, కోటిలింగాలు, గుడిమల్లం, ముక్కోటి ఆలయాల సందర్శనకు బస్సులు కేటాయించామని పేర్కొన్నారు. వివరాలను గురువారం ఆన్‌లైన్‌లో ఉంచుతామని, భక్తులు ముందస్తుగానే టిక్కెట్ పొందవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7893723453, 8247687578లను సంప్రదించాలని కోరారు.

యాచవరం సొసైటీ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు

బాలాయపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు... మండలంలోని ఆక్కసబముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 178లో 4.60 ఎకరాలను యాచవరం ఎస్సీ కాలనీకి చెందిన వరికూటి అన్నపూర్ణ ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిని ఆక్రమించుకునేందుకు వెంగమాంబపురం గ్రామానికి చెందిన యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడు ఎక్స్‌కవేటర్, దోజర్లతో చదును చేస్తుండగా అన్నపూర్ణ తన మరిది జయరామయ్యతో కలిసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో సీసీ నాయుడు దాడి చేసి కులంపేరుతో దూషించాడని అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పద్మావతి వర్సిటీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో నాలుగు రోజుల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ చేపట్టింది. విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడం, ప్లేస్‌మెంట్ అవకాశాలకు సిద్ధం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇన్ఫోసిస్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ పూర్తి అయిన తర్వాత క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కూడా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని ప్రారంభించగా, సైన్స్ డీన్ సుధా నిర్వహించారు.

గంగమ్మ ఆలయ నిర్మాణంపై కోర్టుకు

గడ్డంవారిపల్లెలో తహసీల్దార్ విచారణ



ఇరువర్గాలతో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి, పోలీసులు

చౌడేపల్లె, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి):చౌడేపల్లె మండలం గడ్డంవారి పల్లె లోని గ్రామ దేవత గంగమ్మ ఆలయ నిర్మాణ విషయమై గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ విషయంపై విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని తహసీల్దార్ పార్వతిని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గడ్డంవారి పల్లె బీసీకాలనీలో గంగమ్మ ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాని వెనుక 25 ఏళ్ల క్రితం గ్రామస్తులు మరో చిన్న ఆలయం నిర్మించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకుడు గిరి ఆ ఆలయాన్ని తొలగించి మరో ఆలయాన్ని ప్రభుత్వ నిధులతో నిర్మించారు. పనులు 90 శాతం మేర పూర్తి చేశారు కూడా. కూటమి ప్రభుత్వం రాగానే పురాతనమైన ఆలయాన్ని తొలగించి ఆ స్థానంలో మరో చిన్న ఆలయ నిర్మాణం చేపట్టారు.దీంతో వైసీపీ నాయకుడు గిరి తాను కట్టించిన ఆలయంలోకి వెళ్లేందుకు దారి లేకుండా కొత్త ఆలయం నిర్మించారంటూ హైకోర్టును ఆశ్రయించారు.ఈ విషయంపై హైకోర్టు న్యాయమూర్తి కలెక్టర్‌ను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.దీంతో తహసీల్దార్‌ను విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఈ నేపథ్యంలో తహసీల్దార్ పార్వతి, ఎస్ఐ నాగేశ్వరరావు బుధవారం ఇరువర్గాలను విచారించారు.రెండు ఆలయాలు నిర్మించుకుని, గ్రామస్తులంతా కలసి మెలసి పూజలు చేసుకోవాలని కోరారు. అందుకు గ్రామస్తులు సమతించినట్లు, నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. కోరారు. ఆలయాలు నిర్మించుకొని గ్రామస్తులంతా కలిసి మెలసి పూజలు జరుపుకోవాలని కోరారు. అందుకు గ్రామస్తులు సమ్మతించినట్లు నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

పోలీసుల త్యాగాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి

● ఏఎస్పీ రాజశేఖర రాజు



పలమనేరులో అరుణను సన్మానిస్తున్న ఏఎస్పీ రాజశేఖరరాజు తదితరులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులు, త్యాగాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఏఎస్పీ రాజశేఖర రాజు పిలుపునిచ్చారు. బుధవారం పోలీసు అమరవీరుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి కుటుంబ సభ్యులను సన్మానించే కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా 2007లో ల్యాండ్‌మైన్ పేలుడు వల్ల చనిపోయిన ఏఆర్ కానిస్టేబుల్ హుస్సేన్‌బాషా నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, మృతుడి భార్య హబీబున్నీసాను శాలువాతో సత్కరించారు. అలాగే పలమనేరు అడవిలో మహిళ మిస్సింగ్, అత్యాచారం కేసులో నిందితుడైన తుకారాం కోసం వెళ్లి ప్రాణాలను పోగొట్టుకున్న జవహర్ నాయక్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి, మృతుడి భార్య అరుణను శాలువాతో సత్కరించారు. విధి నిర్వహణలో మృతి చెందిన కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని ఏఎస్పీ ఈ సందర్భంగా భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ మహేశ్వర, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ధ్వంసమైన ఇల్లు

మహిళకు గాయాలు



సిలిండర్ పేలిన దాటికి ధ్వంసమైన ఇల్లు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలోని పందారం వీధిలో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో ఓ మహిళ గాయాలపాలై ఇల్లు ధ్వంసమైంది. స్థానికుల వివరాల మేరకు.. పందారం వీధిలో భూలోకయ్య, చినపాపమ్మ జీవిస్తున్నారు. ఉదయం ఆమె టీ పెట్టుకోవడానికి గ్యాస్ స్టౌవ్‌ను వెలిగించింది. ఆ సమయంలో భర్త భూలోకయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఏమి జరిగిందో కానీ గ్యాస్ సిలిండర్ నుంచి ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. ఈ క్రమంలో ఆమె భయానికి గురై బయటకు రావడానికి ప్రయత్నించింది. ఆ సమయంలో ఆమె ధరించిన చీరకు మంటలు వ్యాపించడంతో భయంతో బయటకు పరుగులు తీసింది. అనంతరం ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో పందారంవీధిలోని ప్రజలు భయాందోళనకు గురై పరుగులు తీశారు. కొంత సమయానికి తేరుకున్న గ్రామస్తులు సిలిండర్ పేలిన ఇంటి వైపు వెళ్లి పరిశీలించారు. ధ్వంసమైన ఇంటి వెలుపల చినపాపమ్మ అగ్ని మంటలలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మంటలను అదుపు చేసి ఆమెను చికిత్సల నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం ఆమెను రాణిపేట సీఎంసీకి తరలించారు. ఈ ఘటనలో ఇంటి మొదటి అంతస్తు స్వల్పంగా దెబ్బతిందని, ఆ ఇంటిని పిల్లర్లు లేకుండా నిర్మించినందున మొదటి అంతస్తును సైతం పూర్తిగా తొలగించవలసి వస్తుందని స్థానికులు అంటున్నారు.

గాంధీ విగ్రహ కూడలిలో పోలీసు బ్యాండ్ షో



చిత్తూరు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో బ్యాండ్‌షోను నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం కూడలిలో బ్యాండ్‌షో కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బ్యాండ్‌షోను 200 మంది పోలీసులు, హోంగార్డులు, విద్యార్థులతో కలిసి నిర్వహించామని, ఈ షో ప్రజలు మన్ననలను పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, సీఐ మహేశ్వర, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్, వీరేష్, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు శరణ్య ఎంపిక



శరణ్యకు ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ ఎంపీపీ దీపశ్రీ

గుడిపాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరహరిపేట జడ్పీహైస్కూల్ ప్లస్‌లో ప్రథమ సంవత్సరం చదువుతున్న శరణ్య జాతీయ స్థాయి కుస్తీపోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం దుర్వాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్-19 ఆంధ్రప్రదేశ్ కుస్తీ పోటీల్లో 76 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. నవంబరు 1నుంచి 5వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం పానిపట్టులో నిర్వహించే జాతీయ కుస్తీపోటీల్లో ఏపీ తరఫున శరణ్య పాల్గొననున్నట్లు ఆయన తెలియజేశారు. క్రీడలకు వెళ్లేందుకు శరణ్య ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో మాజీ ఎంపీపీ దీపశ్రీ రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. ఇదేవిధంగా రాష్ట్ర స్థాయి కుస్తీపోటీల్లో 80 కేజీల విభాగంలో ఉదయ్‌యాదవ్, 60 కేజీల విభాగంలో చైతన్యప్రసాద్ ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం, విద్యా కమిటీ ఛైర్మన్ టీఆర్.ఢిల్లీబాబు, పీటీలు రవి, గురుప్రసాద్ అభినందించారు.







ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - ధ్వంసమైన మామిడిచెట్లు - బోరు బావిలోకి మోటర్‌ను ఏనుగులు తోసేశాయంటున్న రైతు బసవయ్య (వృత్తంలో బోరుబావి)

అడవిలో ఏకమైన ఏనుగుల గుంపు

● దేవళంపేటలో పంటలపై విచ్చలవిడిగా దాడులు

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లా కళ్యాణి డ్యాంలో సంచరిస్తున్న తొమ్మిది ఏనుగుల గుంపు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోకి మళ్లీ ప్రవేశించాయి. అంతకుముందే అక్కడ తిరుగాడుతున్న ఏడు ఏనుగుల గుంపును కలుసుకున్నాయి.పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా 17ఏనుగులగుంపు పంటలను ధ్వంసం చేస్తున్న సంగతి తెలిసిందే.ఇటీవల ప్రమాదవశాత్తు కట్టమీద నుంచి జారిపడి ఓ ఏనుగు మృతి చెందాక తొమ్మిది ఏనుగులు కళ్యాణి డ్యాం వైపు వెళ్లిపోయాయి. అయితే ఆ ఏనుగులు సోమవారం రాత్రి పులిచెర్ల మండలంలోకి చేరుకున్నాయి. అడవిలో సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపులో మంగళవారం రాత్రి కలిసిపోయాయి. దేవళంపేట పంచాయతీలో పంటలపై 16ఏనుగులు కలిసి విచ్చలవిడిగా దాడులు చేయడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. వ్యవసాయ బోరు మోటర్‌ను ఏనుగుల గుంపు బోరులోకి తోసేయడంతో ఓ రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లె వద్దకు చేరుకున్నాయి. వెంకటమ్మ చెరువు మార్గంలో పొలాల్లోకి చేరుకున్న ఏనుగుల గుంపు పంటలపై దాడులు ప్రారంభించాయి. మిట్టమీదరాచపల్లిలోని బసవయ్య, రమణమ్మలకు చెందిన వరి, టమోటా పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు బసవయ్యకు చెందిన వ్యవసాయ బోరు మోటారును సైతం బోరులోకి తోసేశాయి. ఇదే గ్రామంలోని సుధాకర్, రెడ్డెప్పరెడ్డి, గిరిప్రకాష్‌రెడ్డి, భాస్కర్, బాలరాజుకు చెందిన మామిడి, కొబ్బరి, వేరుశనగ, వరి, అలసంద పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తిరిగి గెండేవారిపల్లె వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు అమరనాథ రెడ్డి, రామచంద్రనాయుడుకు చెందిన వరి, కొబ్బరిచెట్లను ధ్వంసం చేసి రాతికూసాలను విరిచేశాయి. అనంతరం హంద్రీ-నీవా కాలువ మీదుగా అడవిలోకి చేరుకున్నాయి. బుధవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద 16 ఏనుగుల గుంపు తిష్ట వేశాయని ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు తెలిపారు.ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్ద బసచేయరాదని హెచ్చరించారు.

ప్రజాసేవకై పరితపించిన కలెక్టర్ నాగార్జున



వీడియో కాన్ఫరెన్స్ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దాదాపు 30 ఏళ్ల క్రితం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1990-91 ప్రాంతంలో కలెక్టర్‌గా పనిచేసిన ఎస్.నాగార్జున ప్రజాసేవకై పరితపించిన కారణజన్ముడని, ఒక అరుదైన వ్యక్తి అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లో ఎం.నాగార్జున ఐఏఎస్ పేరిట నూతన హంగులతో పునర్నిర్మించిన వీడియో కాన్ఫరెన్స్ హాలు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం హాలులో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ నాగార్జున కలెక్టర్‌గా పనిచేసి ఉమ్మడి జిల్లా ప్రజల ఆదరాభిమానాలు పొందారన్నారు. ప్రజల కష్టాలు తీర్చడంలో ముందుగా నిలబడ్డ నాగార్జున అంటూ రాష్ట్రంలోనే అక్షర తపస్మాన్‌ను తొలుత చిత్తూరు జిల్లాలో ప్రారంభించినట్లు గుర్తుచేస్తూ ఆయన పేరిట హాలును ఏర్పాటు చేసి, ఆయనకు అంకితమిచ్చామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కార్పొరేట్ తరహాలో పచ్చదనం పెంపు, పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పన, రికార్డుల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రికార్డులను సమర్థవంతంగా నిర్వహిస్తే ఎంతటి జటిలమైన సమస్యనైనా పరిష్కరించవచ్చన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్ మాట్లాడుతూ 17 తహసీల్దార్ కార్యాలయాల్లో అవసరమైన ఎమ్మార్వో ఛాంబర్లు, మీటింగ్ హాళ్లు, ప్రజలకోసం వెయిటింగ్ హాళ్లు, మరుగుదొడ్ల మరమ్మతులకు కలెక్టర్ సహకరిస్తున్నారని చెప్పారు. మోహన్‌కుమార్ డీఆర్వోగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన్ను కలెక్టర్‌తో సహా పలువురు అధికారులు అభినందించారు. తొలుత కలెక్టర్, డీఆర్వోలను చిత్తూరు అర్బన్ ఎమ్మార్వో కులశేఖర్ శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జయలక్ష్మి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నగరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతి జిల్లాలో కలపండి

● ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే భానుప్రకాష్ విజ్ఞప్తి



నగరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతి జిల్లాలో కలిపే విషయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మరో మెట్టు ఎక్కారు. నగరి నియోజకవర్గంలోని విజయపురం, నిండ్ర, నగరి మండలాలు గతంలో చిత్తూరు జిల్లాలో ఉండేవి. వాటిని తిరుపతి జిల్లాలో కలపడానికి మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబుని ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రత్యేకంగా కలిసి తమ నియోజకవర్గాన్ని రెండుగా విభజించకుండా పూర్తిగా తిరుపతి జిల్లాలో ఉండేలా చూడాలని విన్నవించారు. ఇందుకు అనుకూలంగా ముఖ్యమంత్రి స్పందించినట్లు ఎమ్మెల్యే ఓ ప్రకటనలో తెలిపారు. సరిహద్దుల్లో మార్పులు చేర్పులపై ఏర్పడిన మంత్రివర్గ ఉప సంఘం తన ప్రాథమిక నివేదికలో నగరి నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని నివేదించింది.

డెయిరీ వ్యర్థాలతో చెరువులో చేపల మృతి



డెయిరీ వ్యర్థాలతో మృతిచెందిన చేపలు, పాములు -కారకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : డెయిరీ వ్యర్థాలతో చెరువుల్లోని నీరు కలుషితమై చేపలు, పాములు మృతి చెందిన సంఘటన గంగవరం మండలం పసపత్తూరు పంచాయతీలో జరిగింది. కొంత కాలంగా పసపత్తూరు సమీపంలోని పామ్‌గేట్ డెయిరీ వ్యర్థాలను పరిసర ప్రాంతాల్లోని వనపగుంట, తూముగుంట, కమ్మవాళ్లకుంట చెరువుల్లో వదిలేయడంతో మంగళవారం రాత్రి చేపలు, పాములు, కప్పలు అధిక సంఖ్యలో మృతిచెందాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం చెరువుల వద్దకు చేరుకుని పరిశీలించారు. మత్స్య, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో పాటు పొల్యూషన్ కంట్రోల్ అధికారులను పిలిపించి చెరువు నీరు కలుషితం కావడానికి గల కారణాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. జంతువులకు నీరు తాగించకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. డెయిరీ నుంచి వస్తున్న వ్యర్థాలను గుర్తించి చెరువుల్లోకి రాకుండా అరికట్టాలని.. చెరువునీటిని శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. చేపలు, పాములు మృతి చెందడానికి కారణమైన వారి నుంచి నష్టపరిహారం వసూలు చేయించాలని.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని ఆదేశించారు.ఏఎంసీ ఛైర్మన్ రాజన్న, తహసీల్దార్ రేఖ, ఇరిగేషన్ డీఈ చొక్లానాయక్, ఏఈ లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పయని, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సోమశేఖరగౌడ్, ప్రతాపరెడ్డి, ప్రసాదనాయుడు, భాస్కరరెడ్డి, గిరిధర్ గోపాల్, సోము, శేఖర్, రెడ్డెప్ప, శీన, హేమగిరి పాల్గొన్నారు.

పసలకొండ గుట్టలో ఆవును చంపిన చిరుత

● భయాందోళనలో పుత్రమద్ది ప్రజలు

ఐరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం పుత్రమద్ది వద్ద ఉన్న పసలకొండ రెవెన్యూ గుట్టలో బుధవారం ఓ చిరుత ఆవును చంపి తినేసింది. పుత్రమద్దికి చెందిన మార్కొండయ్య కుమారుడు భాస్కర్‌కు చెందిన ఆవు మేత కోసం గుట్ట ప్రాంతానికి వెళ్లింది. అక్కడ ఆవును చిరుత చంపి తినేసింది. ఈ విషయాన్ని గమనించిన భాస్కరయ్య అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో డీఆర్వో రాజేష్‌కుమార్, ఎఫ్‌బీవోలు లావణ్య, పద్మావతి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డీఆర్వో రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ఆవును అడవి మృగం చంపిందన్నారు. అయితే ఆవు చనిపోయిన ప్రాంతం పూర్తిగా బోద ఉండటంతో పాదముద్రలు సరిగా పోల్చుకోలేకపోయామన్నారు. ఆవును హైనాగాని, చిరుతగాని చంపి ఉండవచ్చునన్నారు. ఈ ప్రాంతంలో పశువులు మేపే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ప్రాంతంలో పశువులు మేపేందుకు వెళ్లకుండా ఉండటం చాలా మంచిదన్నారు.

గోశాలపై ఇప్పుడేమంటారు? : భూమన

తిరుపతి(జీవకోన), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 'గోశాల నిర్వహణ సరిగా లేదని బోర్డు సమావేశంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు చెప్పారు. మరి అదే విషయాన్ని నేను చెబితే నామీద కేసులు పెట్టారు. అవే సెక్షన్లు టీటీడీ ఛైర్మన్‌కి కూడా వర్తిస్తాయి కదా' అని టీటీడీ మాజీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం తన నివాసంలో రికార్డు చేసిన ఒక వీడియోను ఆయన ప్రకటనగా విడుదల చేశారు. ఏప్రిల్‌లో తాను గోశాల నిర్వహణ సరిగా లేక గోవుల మరణాలు జరిగాయని అన్నందుకు బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మత విద్వేషాలను రెచ్చగొడుతున్నానంటూ ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గోశాల నిర్వహణకు ప్రత్యేక కమిటీని వేసి, గోవులను స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇచ్చే ఆలోచన ఉందని, దీనిపై వచ్చేబోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఏకంగా టీటీడీ ఛైర్మనే చెప్పారని అన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● చిత్తూరు డీఎస్పీ సాయినాథ్



చిత్తూరుఅర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సూచించారు. బుధవారం చిత్తూరు వన్‌టౌన్, క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మత్తు వల్ల వ్యక్తి భవిష్యత్తు నాశనం అవుతోందని, వారి కుటుంబం కూడా రోడ్డున పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో యువత సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. తెలియని లింకులు, అనుమానాస్పద మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదన్నారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తియాప్‌ను అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించి రక్షణ పొందాలన్నారు. ఈ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. మానసిక ఆరోగ్యం, మత్తు దుర్వినియోగం, రోడ్ సేఫ్టీ, యువతలో చైతన్యం వంటి విషయాలపై ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర వివరించారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా యువత ముందడుగు వేయాలన్నారు. కొంత మంది మోసగాళ్లు సైబర్ పోలీసులుగా నటిస్తూ వీడియో కాల్స్ లేదా ఫోన్ ద్వారా బెదిరించి మీపై కేసులు నమోదయ్యాయని చెబుతూ డబ్బులు గుంజుతున్నారన్నారు. అలాంటి బెదిరింపులు వచ్చినప్పుడు 1930 నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, 200 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ రక్త కేంద్ర లైసెన్సు మంజూరుకు సహకరిస్తా



రెడ్ క్రాస్ సభ్యులతో కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్‌క్రాస్ రక్త కేంద్ర లైసెన్సు మంజూరు, రక్త కేంద్రం మార్పిడి, రక్తదాన శిబిరాల ఏర్పాటు, సభ్యత్వ నమోదుకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం పీజీసీఐఎస్ సౌజన్యంతో స్థానిక పలమనేరు రోడ్డులో నిర్మించిన రెడ్ క్రాస్ సొసైటీ రక్త కేంద్ర భవనాన్ని ఆయన సందర్శించారు.నూతన భవనాన్ని త్వరగా పూర్తిచేసి ప్రజల అవసరార్థం వెంటనే ప్రారంభించాలని ఆయన సభ్యులను ఆదేశించారు. రక్తకేంద్రానికి అవసరమైన క్యాంపు వెహికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌కు సీఎస్ఆర్ నిధులు సమకూర్చేందుకు, రక్తకేంద్ర భవన మొదటి అంతస్తులో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులకు సొంత నిధులు అందించేందుకు విజయం విద్యాసంస్థల అధినేత, రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి డాక్టర్ ఎం.తేజోమూర్తి హామీ ఇచ్చారు. జిల్లా ఛైర్మన్ వి.రమేష్ బాబు మాట్లాడుతూ జిల్లా ఛైర్మన్ వి.రమేష్ బాబు మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజాకిరణ్ సీఎస్ఆర్ నిధులతో ఇదే భవనంలో రెండో అంతస్తు నిర్మాణానికి తొలి విడతగా రూ.20 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. వైస్ ఛైర్మన్ కె.గోవర్ధన్ బాబి, రక్తకేంద్ర వైద్యాధికారులు జయశంకర్, విజయ్‌కుమార్, కోఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

వెంటాడుతున్న చిరుత భయం

● ఆందోళనలో వెటర్నరీ వర్సిటీ వర్గాలు

తిరుపతిరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో చిరుత సంచరిస్తుండడంతో వర్సిటీ అధ్యాపక, ఉద్యోగ, విద్యార్థి వర్గాలు భయాందోళన చెందుతున్నారు. న్యూట్రిషన్ విభాగం, టీవీసీసీ, పందుల పరిశోధన స్థానం, డెయిరీ టెక్నాలజీ కళాశాల వసతిగృహం, ప్రధాన పరిపాలనా భవనం, గెస్ట్‌హౌస్ తదితర ప్రాంతాల్లో తరచూ సంచరిస్తుండడంతో ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. ఈ నెల 15న వెటర్నరీ కళాశాల పరిధిలోని యానిమల్ న్యూట్రిషన్ విభాగానికి సమీపంలో పాథాలజీ విభాగం వెనుక వైపు చెట్ల పొదల్లో ఓ ఉద్యోగికి చిరుత కనిపించిందన్న ప్రచారం జరిగింది. గతంలో వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట, నిరంతర పశువైద్య విద్య సమాచార కేంద్ర విభాగాలకు సమీపంలోని ప్రహరీపై సంచరించడం తెలిసిందే. ఈ విషయమై అధికార వర్గాలు డీఎఫ్‌వో సాయిబాబాను కలిసి కళాశాల క్యాంటీన్, బాలుర, బాలికల హాస్టల్స్ పరిసరాల్లో బోన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

రాజకాలువ కనుమరుగు..!

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు



స్టేట్ బ్యాంకు పక్కనే రాజకాలువపైనే నిర్మించిన సిమెంట్ రోడ్డు



బజారు వీధిలో రాజకాలువ ఆనవాళ్లు లేకుండా నిర్మించిన గది



ఆర్టీసీ బస్టాండు వద్ద కాలువపైనే నిర్మించిన గదుల సముదాయం



రాజకాలువపై పూలమార్కెట్ వద్ద వెలసిన దుకాణాలు

పలమనేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గత నాలుగు రోజుల క్రితం కేవలం గంటసేపు కురిసిన కుండపోత వర్షానికి ఆర్టీసీ బస్టాండు మోకాల్లోతు నీటితో నిండిపోయింది. బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్ జలమయమైంది. దీనికి కారణం రాజు కాలువ పూర్తిగా ఆక్రమణలకు గురి కావడమే. పలమనేరు ఏర్పడిన తొలినాళ్లలో . బ్రిటీష హయాంలోనే భారీ వర్షాలు కురిస్తే ఆ నీరు ప్రజా జీవనానికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వర్షపు నీరంతా పలమనేరులోని ప్రస్తుత ఆర్టీసీ బస్టాండు ఉన్న చిన్న కుంటలోకి, అక్కడి నుంచి పలమనేరుకు ఆనుకొనే ఉన్న పెద్దచెరువుకు వెళ్లేందుకు రాజు కాలువను ఏర్పాటు చేశారు. ఈ కాలువను అప్పట్లో దాదాపు 10 అడుగుల వెడల్పుతో ఏర్పాటు కాగా.. కాలానుగుణంగా పలమనేరు రోజురోజుకూ విస్తరిస్తోంది. అయితే ఇదే సమయంలో రాజు కాలువను ఆక్రమించడం ప్రారంభించారు. బజారు వీధిలో ప్రారంభమయ్యే ఈ రాజు కాలువ గంగమ్మ తోపు నుంచి బస్టాండు ప్రహరీకి ఆనుకొని పూలమార్కెట్ మీదుగా పెద్దచెరువుకు వెళ్తుంది. అయితే బజారు వీధిలో ఈ కాలువ ప్రారంభంలోనే ఆక్రమణకు గురై దానిపైనే ప్రైవేటు వ్యక్తులు గదిని నిర్మించుకొన్నారు. అక్కడి నుంచి గంగమ్మ తోపు, గంగమ్మ గుడి వీధి పక్కనే ఉన్న ఈ కాలువ కాలక్రమేణ కేవలం రెండు నుంచి మూడు అడుగులకే పరిమితమైపోయింది. ఈ కాలువకు ఇరువైపులా ఒక పక్క రోడ్డు, మరో పక్క భవనాలు వెలిశాయి. ఆర్టీసీ బస్టాండు ప్రహరీ పక్కన వెళ్తున్న ఈ రాజు కాలువను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలక వర్గం అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఎటువంటి అనుమతులు లేకుండా వాణిజ్య సముదాయం గదులు నిర్మించారు. అయితే గదులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని అధికారులు వీటిని వినియోగంలోకి తీసుకురాలేదు. అలాగే గత వైసీపీ హయాంలో ఈ సముదాయంతో పాటు పలమనేరులో పలు ప్రభుత్వ స్థలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా గదుల నిర్మించారు. అధికారులకు అన్నీ తెలిసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రాజు కాలువ ఆక్రమణలు తొలగించి వర్షపు నీరు పూర్తి స్థాయిలో వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే వర్షాలు పడినప్పుడల్లా పలు ప్రాంతాలు జలమయవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రాజు కాలువ ఆక్రమణలు తొలగించి కాలువను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్ రైడర్లతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



గ్రేట్ ఆంధ్రా రైడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గ్రేట్ ఆంధ్రా రైడ్ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, పీకేం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పంలో ప్లాస్టిక్ నిషేధం అమలుపై ఈ రైడ్‌తో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పర్యావరణ కాలుష్య కారకమై, ప్రజారోగ్యంపై వ్యతిరేక ప్రభావం చూపే ప్లాస్టిక్ వినియోగాన్ని మానేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ఇక్కడి ప్రఖ్యాత పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల గురించి చాటిచెప్పాలని రైడర్స్‌కు సూచించారు. కార్యక్రమంలో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, రాష్ట్ర వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, కడా డైరెక్టర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సదుపాయాలకు పెద్దపీట



సమస్యలపై చర్చిస్తున్న నాయకులు, కమిషనర్ తదితరులు

కుప్పం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు పెద్దపీట వేస్తామని మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, రెస్కో చైర్మన్ వీజీప్రతాప్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్ అన్నారు. వీరంతా మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావుతో కలిసి బుధవారం పురపాలక సంఘం 6వ వార్డు పరిధిలోని అనిమిగానిపల్లెలో పర్యటించారు. స్థానిక రోడ్లు, సచివాలయం, మురుగునీటి కాలువలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తగినన్ని నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ లెక్కకుమిక్కిలిగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. వీధి లైట్లు, మురుగునీటి కాలువలు, రోడ్లు వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం పలు పరిశ్రమల స్థాపన చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఎప్పటికప్పుడు సమస్యలను తమకు తెలియజేస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, రాష్ట్ర వన్యకుల కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరుకోవాలంటే సాహసమే..!



ఇంటికి వెళ్లేందుకు ప్రమాదకరంగా వాగు దాటుతున్న మహిళలు

సదుం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాము నివసిస్తున్న ఇంటి కోసం ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఊటుపల్లె గ్రామ పంచాయతీ శివపురంలో కృష్ణయ్య కుటుంబం తన సొంత భూమిలో ఇంటి నిర్మాణం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇంట్లో భార్యబిడ్డలు, అత్తమామలతో కలిసి గత దశాబ్ద కాలంగా నివసిస్తున్నారు. అయితే వారున్న ఇంటి పరసర ప్రాంతంలో వాగులు, వంకలు ఉండటంతో వర్షాకాలంలో ఇంటి నుంచి రాకపోకలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దారి సమస్యపై అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొంథా తుఫాన్ ప్రభావంతో వాగులు, వంకలు జోరుగా ప్రవహిస్తున్నా అర చేతిలో ప్రాణాలు పెట్టుకుని నీటిలో దాటుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



సోమలలో మాట్లాడుతున్న ఎస్ఐ శివశంకర

సోమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో రాణించాలని సోమల ఎస్ఐ శివశంకర తెలిపారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్లలో వివిధ రకాల యాప్‌లను చూడరాదని, బెట్టింగులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్ర, గంగాధరం నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొల్లా కోటీశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓలు శిద్ధరామయ్య, తాతయ్య

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎంఈఓలు శిద్ధరామయ్య, తాతయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవంపై మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మేఘన ప్రథమ స్థానంలో నిలిచింది. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ ద్వితీయ స్థానంలో నిలవగా పులిచెర్ల ఎంజేపీ పాఠశాల విద్యార్థి వేదశ్రీ తృతీయ స్థానంలో నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించారని ఎంఈఓలు తెలిపారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



విద్యార్థుల ఆధార్ కార్డు అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

సదుం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 5 నుంచి 15 ఏళ్ల లోపు వయస్సున్న ప్రతి విద్యార్థికి ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరి అని ఎంపీడీవో రాధారాణి సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లెలో ఈగలతో ఇక్కట్లు



చౌడేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా చౌడేపల్లెలో ఈగలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే గత వారం ఎంపీడీవో లీలామాధవికి ఈగల కారణంగా వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు విన్నవించారు. స్థానిక గడ్డంవారిపల్లె రోడ్డులో నివాసాల వద్ద ఈగల బెడద అధికంగా ఉంది. భోజనం తినే సమయంలో ప్లేట్లలోకి ఈగలు వాలుతున్నాయని.. నోట్లో అన్నం పెట్టుకోవాలంటేనే భయపడుతున్నామని వాపోతున్నారు. గడ్డంవారిపల్లె రోడ్డు సమీపంలో ఉన్న కోళ్ల ఫారాల నుంచి ఈగలు వస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎంపీడీవో ఈగలు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అడుసు తొక్కకుండా అడుగేయలేం

సీసీ రోడ్డుకోసం సూర్యానగర్ మహిళల నిరసన



బురదరోడ్డులో నిరసన తెలియజేస్తున్న సూర్యానగర్ మహిళలు

పుంగనూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం కురిసినా మట్టి రోడ్డు బురదగుంటగా మారి ఇంటి నుంచి అడుగుబయట పెట్టాలంటే అడుసు తొక్కకుండా వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉందని పుంగనూరు సూర్యానగర్ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సూర్యానగర్‌లోని 1వ వీధి మహిళలు, ప్రజలు తమకు సిమెంట్ రోడ్డు నిర్మించాలని బురదనీటి రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు చేయించి వెంటనే సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని కృష్ణప్ప, మహిళలు కళావతమ్మ, వసంతమ్మ తదితరులు కోరారు.

అన్నదానం



పుంగనూరు, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న 150 మంది నిరుపేదలకు పుంగనూరు ఏబీవీపీ విద్యార్థులు ఉచితంగా భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. బుధవారం పట్టణంలోని పలుచోట్ల వలస కార్మికులు, ఆలయాలు, బస్టాండ్ల వద్ద యాచకులు, నిరుపేదలకు పులిహోరా, పెరుగు అన్నం ప్యాకెట్లు అందించారు.

మహా కాలభైరవ స్వామికి అష్టమిపూజ

పుంగనూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణా దేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి మహా కాలభైరవస్వామికి భక్తిశ్రద్ధలతో అష్టమిపూజ జరిగింది. స్థానిక ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం దీక్షితులు, రామచంద్ర దీక్షితులు స్వామివారికి పూజలు చేశారు.

యాదకుంట చెరువు కట్ట బలోపేతానికి చర్యలు



చురుగ్గా జరుగుతున్న యాదకుంట చెరువు కట్ట పనులు

వి.కోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం యాదకుంట చెరువు కట్ట బలోపేతానికి ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాలకు చెరువు నిండటంతో కట్ట మధ్య భాగం దిగువకు జారి పడింది. దీంతో చెరువు కట్ట పరిస్థితిని పరిశీలించిన అధికారులు కట్ట బలోపేతానికి దిగువ భాగంలో ఇసుక బస్తాలను నింపి కట్ట మధ్యలో మట్టిని పోస్తున్నారు. ఓ వైపు నీటి మట్టం తగ్గించేందుకు మొరవ భాగంలో లోతు చేసి నీటిని దిగువకు విడిచారు. దీంతో చెరువు నుంచి నీరు లీకవ్వడం తగ్గడంతో కట్ట జారి పడిన ప్రాంతంలో మట్టిని వేసి లీకేజీని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు సుమారు వెయ్యి బస్తాలను దిగువ ప్రాంతంలో వేసి కట్ట మళ్లీ జారిపోకుండా కూలీలు పనులు చేస్తున్నారు. యాదకుంట గ్రామస్తులు చెరువు కట్ట పూర్తి స్థాయిలో బలోపేతం చేసే వరకు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, సీఐ సోమశేఖర్ సూచన చేశారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



టీటీడీ ఈవోను కలిసిన మునీంద్రనాయక్

పుంగనూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- తిరుమల పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు మునీంద్రనాయక్ కలిసి వినతి పత్రం అందించారు. బుధవారం ఆయన తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యాలయంలో కలిసి పలు సమస్యలను ఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో భజన మందిరాలు నిర్మించాలని, గిరిజన గోవింద కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు రాజ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల గ్రామ ప్రదక్షిణ



ప్రదక్షిణగా తీసుకెళ్లిన సీతారాముల విగ్రహాలు

సదుం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సదుం దిగువ జాండ్రపేటలో నూతనంగా నిర్మించిన సీతారామ స్వామి వారి దేవస్థానంలో నూతన విగ్రహావిష్కరణలో భాగంగా బుధవారం మహాగణపతి, సాయిబాబా, సీతారాముల నూతన విగ్రహాలను గ్రామ ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు శాంతి హోమం, వేదపారాయణం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుంగనూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

వెంకటరమణస్వామి కల్యాణోత్సవం

పుంగనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం రాత్రి తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీవారి కల్యాణం జరుగుతుందని ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కల్యాణవెంకటరమణస్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలయంలో శ్రీవారికి కల్యాణం శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు నిర్వహిస్తారని వివరించారు. కల్యాణంలో ఆలయంలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై వెంకటరమణస్వామి కృప పొందాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

పుంగనూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న తండ్రి మందలించాడని పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకుని తిరుపతిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని మేలుందొడ్డి గ్రామానికి చెందిన బాబు కుమారుడు కిరణ్‌కుమార్(23) ఫైనాన్స్‌లో కారు కొనుగోలు సకాలంలో చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లడంతో కిరణ్‌కుమార్‌పై తండ్రి బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కిరణ్‌కుమార్ పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు. తిరుపతిలో చికిత్సపొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

సురక్షిత నీటి సరఫరాకు చర్యలు



క్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

సోమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. బుధవారం ఇరికిపెంట, వడ్డిపల్లె, సోమలలో ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని కార్యదర్శులకు సూచించారు. మంచి నీటి కొళాయిల వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుడికి ఘనసన్మానం



అధ్యాపకుడు శివయ్యను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

సోమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమల జూనియర్ కళాశాలలో 15 ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకుడిగా విధులు నిర్వహించిన శివయ్యను స్థానిక కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్ ఘనంగా సన్మానించారు. కూటమి ప్రభుత్వంలో శివయ్యకు కడప జిల్లా రాజంపేటలో స్కూల్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ రావడంతో ప్రభుత్వ టీచర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను ప్రిన్సిపాల్ అమరేంద్ర, పుంగనూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొల్లా కోటీశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య



చౌడేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు .. మండలంలోని పందికృపల్లె పంచాయతీ దేవరగుడిపల్లెకు చెందిన అంజిరెడ్డి కుమార్తె పుష్ప (25)కు మండలంలోని పెద్దకొండామారికి చెందిన రామకృష్ణారెడ్డి కుమారుడు దివాకర్‌తో 4 ఏళ్ల క్రితం వివాహమైంది. కడుపు నొప్పి తాళలేక ఇంట్లోని ఈగల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మార్గం మధ్యలోనే పుష్ప మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

నేడు శివపార్వతుల కల్యాణ మండపం ప్రారంభం

సోమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వరస్వామి ఆలయంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన శివపార్వతుల కల్యాణ మండపం గురువారం ప్రారంభిస్తున్నట్లు ధర్మకర్త సోమశేఖర్ తెలిపారు. ఈక్రమంలో ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని.. మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి శివపార్వతుల ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

ఇళ్లల్లోకి విషపురుగులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె నెహ్రూనగర్‌లో కాలువల్లో నుంచి పలు క్రిమి కీటకాలు, విష పురుగులు ఇళ్లల్లోకి ప్రవేశిస్తుండటంతో ఈప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు మురుగునీటి కాలువలు పొంగి మురుగునీరు వర్షపునీటితో కలిసి ప్రవహిస్తుండటంతో ఈ సమస్య ఎదురవుతోంది. కాలువల్లో ఉన్న పురుగులు ఇళ్లలోకి వచ్చేయడంతో కంటిపై కునుకు రావడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిలిండర్ పేలిన ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే



ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రం పందారం వీధిలో సిలిండర్ పేలిన ఇంటిని ఎమ్మెల్యే మురళీమోహన్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ఆదుకుంటానన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడి ఇల్లు మంజూరు చేయిస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, ఆలయ చైర్మన్ మణినాయుడు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీరు లేకుండా వేగంగా చర్యలు



వీరభద్రకాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ నరసింహప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగరపాలక అధికారులు, సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి సంతపేట, వీరభద్రకాలనీ, దోబీఘాట్, తోటపాళ్యం తదితర లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాల ప్రభావం తగ్గడంతో ఇళ్ల మధ్య ఉన్న నీటిని తొలగించేందుకు వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న చోట్ల కాలువను వెడల్పు చేయాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని, దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిసరఫరా పైప్‌లైన్లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని, లీకేజీ లేకుండా చూడాలన్నారు. నీటి సరఫరా ట్యాంకులు, సంపులను క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఇంజనీరింగ్, వార్డు కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ఠ



హోమ పూజలో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం రెంటాలచేను గ్రామంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం కార్యక్రమం బుధవారం శాస్త్రోక్తంగా మొదలైంది. ఇందులో భాగంగా గణపతిపూజ, హోమం తదితర కార్యక్రమాలు జరిగాయి. మూల విగ్రహాల గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలు గురు, శుక్రవారం కొనసాగుతాయి. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త సవిరెడ్డి కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ పర్యవేక్షకులు ఎస్.యుగంధర్‌రెడ్డి, ముఖ్యకార్యనిర్వాహకులు ఎస్.ధనంజయరెడ్డి, ఎస్.చెన్నకేశవులురెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, ఎస్.రాంప్రసాద్, ఎస్.బాబురెడ్డి, ఎస్.సాయికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న ప్రభుత్వం



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారని అన్నారు. రాష్ట్రాన్ని తీవ్రంగా వణికించిన మొంథా తుఫాన్ తీవ్రతను అంచనా వేయడం, ప్రజలను అప్రమత్తం చేయడం, ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించడం, సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేయడంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీనేతలు, కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, దేవరాజులు నాయుడు, సురేష్‌కుమార్, దరణి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం: టీడీపీ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న టీడీపీ నేత రాజా

వెదురుకుప్పం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని టీడీపీ నాయకులు వి.రాజా, పొద్దుటూరు రాజా తెలిపారు. బుధవారం కార్వేటినగరం మండలం కొటార్వేడు కాలనీలో వరద నీటి వల్ల ఇళ్లు మునిగిపోయిన కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కొటార్వేడు కాలనీలో ఇళ్లు నీట మునిగిపోయిన బాధితుల విషయం ప్రభుత్వ విప్ థామస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే వారికి నిత్యావసర సరుకులు అందించి ఆదుకోవాలని చెప్పారన్నారు. బాలాజీ, సుమన్, చంద్రమోహన్, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర ఐక్యతా దివాస్ వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

వెదురుకుప్పం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఐక్యతా దివాస్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు బాల్యవివాహాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, వాటి వల్ల చట్టపరమైన చిక్కుల గురించి మహిళా సంరక్షణ కార్యదర్శులు వరలక్ష్మి, రేణుక అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరానికి ఎస్ఐ కావలెను...!

వెదురుకుప్పం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పోలీసుస్టేషన్‌కి ఎస్ఐ కావలెను. సుమారు ఐదు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో ఏఎస్ఐలతో నడుస్తోంది. ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ స్టేషన్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ సొంత మండలంలో ఉంది. ఈ స్టేషన్‌కు ఎస్ఐని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు లీగల్ సర్వీసులపై అవగాహన సమావేశం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి భారతి అధ్యక్షతన లీగల్ సర్వీసులపై అవగాహన సమావేశం జరుగుతుందని ఎంపీడీవో శేషగాని మనోహర్‌గౌడ్ తెలిపారు.

మాంగాడులో తాగునీటికి తిప్పలు



తాగునీటి కోసం తిప్పలు పడుతున్న మహిళలు

నగరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మాంగాడు పంచాయతీలోని భజనగుడి వీధిలో తాగునీటికి వారం రోజులుగా తిప్పలు పడుతున్నట్లు మహిళలు వాపోయారు. యాజమాన్యం లోపం కారణంగా ఆ వీధికి తాగునీరు అందడం లేదని స్థానికులు పేర్కొన్నారు. అమర్చిన చోట నీరు లీకేజీ అవుతుండడంతో పాటు పలు చోట్ల మోటార్లు పెట్టి నీరు తోడుకుంటుండడంతో ఈ వీధికి వారం రోజులుగా తాగునీరు రాక అవస్థలు పడుతున్నామని వారు చెప్పారు. ఈ విషయమై ఎంపీడీవో వాణిని వివరణ కోరగా, తన దృష్టికి తాగునీటి సమస్య రాలేదని, పంచాయతీ కార్యదర్శితో చర్చించి తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు.

యువతి అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు

పెనుమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో పెనుమూరుకు చెందిన విద్యార్థిని(18) కనిపించడంలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్టోబరు 24న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు ఈ కేసును ఛేదించి యువతిని వారి కుటుంబ సభ్యులకు బుధవారం అప్పగించారు. ఆమెతో పాటు కాలేజీలో చదువుతున్న ఓ యువకుడు కృష్ణా జిల్లా గన్నవరం మండలం పెద్ద అవుటపల్లి గ్రామంలో ఉన్నారని పోలీసులు గుర్తించారు. పోలీసులు అమ్మాయి బంధువులతో అక్కడకు వెళ్లి వారిని తీసుకువచ్చి వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే పబ్లిక్‌టుడే పీడీఎఫ్ పత్రికలో పోలీసులు, టీడీపీ నాయకులతో కలిసి అబ్బాయి కుటుంబ సభ్యులను రూ.లక్ష అడిగారని అవాస్తవ కథనం ప్రచారం చేశారని, ఇలా వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెనుమూరు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

మృతుడి గుర్తింపు

యాదమరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందిన వ్యక్తిని అతని బంధువులు గుర్తించారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసిన పోలీసులు, మృతుడి సమాచారాన్ని మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు కూడా పంపించారు. ఈ సమాచారం ఆధారంగా తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా పి.కె.పురానికి చెందిన గోవిందన్ కుమారుడు కామాచ్చినాదన్‌గా గుర్తించి అతడి బంధువులు బుధవారం యాదమరి పోలీస్ స్టేషన్‌కు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం పోలీసులు శవపంచనామా చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతికి కారణమైన వాహనాన్ని త్వరలో ట్రేస్ చేసి, ఆ వ్యక్తిని అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

విజిలెన్స్ థీమ్‌పై డ్రాయింగ్ పోటీలు



విద్యార్థికి బహుమతిని ఇస్తున్న ఐవోసీఎల్ ప్రతినిధులు

బంగారుపాళ్యం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్(వీఏడబ్ల్యూ-2025)లో భాగంగా బుధవారం బంగారుపాళ్యంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విజిలెన్స్ థీమ్‌పై డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మణసాగర్, ఇంజనీర్లు సురేష్, సోము హాజరయ్యారు. ఈ పోటీలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు.

రోగులకు డాక్టర్లు అందుబాటులో ఉండాలి



ఫార్మసీని తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ పద్మాంజలి

పెనుమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం చేయాలని డీసీహెచ్ఎస్ పద్మాంజలి సూచించారు. బుధవారం పెనుమూరు సీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లు పరిశీలించారు. ఫార్మసీలో మందుల స్టాకు తనిఖీ చేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న భవనాలను ఆమె పరిశీలించారు. రాత్రిపూట డాక్టర్లు తప్పక ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీధర్‌బాబు, హెడ్ నర్సు నిర్మలాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

తొలగిన తాగునీటి సమస్య



కొత్తగా వేసిన బోరులో మోటార్‌ను అమర్చి నీళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాలసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురం బీసీ కాలనీలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్య బుధవారంతో తీరింది. ఇటీవల జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ తాగునీటి సమస్యను పరిష్కరించడానికి జిల్లా పరిషత్ ద్వారా రెండు బోర్లను మంజూరు చేయించారు. రెండు బోర్లలో సమృద్ధిగా నీరు రావడంతో బుధవారం అధికారులు బోర్లకు మోటార్లను అమర్చి తాగునీటి పైప్ లైన్‌ను కలిపారు. దీంతో గ్రామంలో తాగునీటి కష్టాలు తొలగాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ నరసింహరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ ట్యాక్స్ జేసీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

చిత్తూరు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సిబ్బందిని కులం పేరుతో వేధించడమే కాకుండా దాడి చేసిన కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేయవలసి వస్తుందని అన్నారు.

వైసీపీ నిర్లక్ష్యం.. ఆ కాలనీ పేదలకు శాపం

● జల దిగ్బంధంలో కొత్త కాలనీ



ఈదులవారిపల్లె చెరువు భూముల్లో జలదిగ్బంధంలో ఉన్న కొత్తకాలనీ

వెదురుకుప్పం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆనాటి వైసీపీ ప్రభుత్వం, అప్పటి యంత్రాంగం నిర్లక్ష్యం కొత్తకాలనీకి శాపమైంది. కార్వేటినగరం మండలం అన్నూరు గ్రామ పంచాయతీకి చెందిన వారికి ఈదురవారిపల్లి సమీపంలోని ఈదురవారిపల్లె చెరువు భూముల్లో గత ప్రభుత్వ హయంలో జగనన్న కాలనీ కింద ఇంటి స్థలాలు కేటాయించారు. అక్కడ ఎనిమిది మంది ఇంటి నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కొత్తకాలనీని వరద నీరు చుట్టుముట్టింది. కాగా అది చెరువు భూమి కావడం వల్ల కొత్తకాలనీ జలదిగ్బంధంలో ఉందని స్థానికులు వాపోయారు. జలదిగ్బంధం నుంచి కాపాడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దుస్థితిలో తారురోడ్లు



గుంతలమయంగా పాతార్కాడు - కనకమ్మసత్రం రోడ్డు

విజయపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో తారు రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. గాండ్లకండ్రిగ నుండి మంగళం మీదుగా విజయపురం వెళ్లే తారురోడ్డు గుంతలమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నజంబాడ నుండి పాతార్కాడు మీదుగా కనకమ్మసత్రం వెళ్లే రోడ్డు, ఎం.అగరం నుండి చివ్వాడకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, ఎక్కడ పడిపోతామో కూడా తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. చెంగమనాయుడు కండ్రిగ నుండి క్షూరికాపురం వెళ్లే రోడ్డు కూడా బురదమయంగా ఉందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వారపు సంతలోకి దూరుతున్న ఆర్టీసీ బస్సులు



వారపుసంతలో తిరుగుతున్న చిత్తూరు ఆర్టీసీ బస్సు

ఐరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఐరాలలోని నాగమువాండ్లపల్లె పంచాయతీ పీఎస్.అగ్రహారంలో ప్రతి బుధవారం వారపు సంతను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలో ప్రతి రోజు చిత్తూరు-ఐరాల ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. అయితే బుధవారం మాత్రం సంత కారణంగా ఐరాల-చిత్తూరు బస్సులు పోలీస్ స్టేషన్ పక్కన తిరుగుతాయి. ఏమైందో ఏమో గానీ ఆర్టీసీ వారు పంతానికి పోయి బస్సులను వారపు సంతలోకి వెళ్లిప్పారు. దీంతో సంతలోని వ్యాపారులు భయభ్రాంతులకు గురై తమ తట్టా బుట్టా తీసుకుని లోపలికివెళ్లారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పందించి వారపు సంత రోజున బస్సులు ఇక్కడ తిరగకుండా చర్యలు తీసువాలని ప్రజలు కోరుతున్నారు. అయితే వారపు సంతను ఆనుకుని ప్రభుత్వాస్పత్రి ఉంది. ఇక్కడికి 108 వెళ్లడానికి కొంత మేర సంత ప్రాంతాన్ని తీసి వేస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ టి.సాయినాథ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అధ్యక్షతన సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. సాంకేతిక పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటిపై విద్యార్థులు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వీలైనంత వరకు మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువుపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. వన్‌టౌన్ సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ ఓటీపీలు, ఇతర వివరాలు ఎవరికీ తెలియజేయరాదని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

పాలసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు పరిమితంగా చూడాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ



వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నిండ్ర, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళంబాకం ఎస్టీ కాలనీ, ఆరూరు ఎస్టీ కాలనీలో మొంథా తుపాను కారణంగా నిరాశ్రయులైన బాధితులకు జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రమేష్, పాదిరి టీడీపీ నాయకుడు నంద ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాల మేరకు వరద బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ నాయుడు, కీళంబాకం సర్పంచ్ రమేష్ నాయుడు, ఆరూరు సర్పంచ్ కేశవ, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు లోకనాథం నాయుడు, నాయకులు పాల్ దినకర్, మహేష్, ధనుష్, వీఆర్‌వో ఆనందయ్య పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు రమణ

చిత్తూరు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి సిద్ధం కావాలని ఏపీ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టం 1996ను పటిష్ఠంగా అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక మర్చిపోయాయని విమర్శించారు. డిప్యూటీ సీఎం కార్యాలయాన్ని ముట్టడించి కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు నాగరాజు, గోపీనాథ్, మణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుడిపాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో వచ్చే జ్వరాలపై గ్రామ స్థాయిలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి సూర్యనారాయణ అన్నారు. బుధవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీజనల్ వ్యాధులపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల వ్యాప్తితో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, దగ్గు, జలుబు, జ్వరాలు ఎక్కువగా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వర్షాలతో అన్నక్యాంటీన్ నిర్మాణ పనులకు ఆటంకం



గంగాధరనెల్లూరులో పిల్లర్లస్థాయిలో ఉన్న అన్నక్యాంటీన్ భవనం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవో (బీడీవో క్వార్టర్స్) కార్యాలయం పక్కన నిర్మిస్తున్న అన్నక్యాంటీన్ భవన నిర్మాణ పనులకు వర్షాలతో ఆటంకం కలిగింది. పునాదులు తవ్వినప్పటి నుంచి కురుస్తున్న వర్షాలవల్ల ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం బేస్‌మెంట్ పూర్తయి, పిల్లర్స్ వరకు పనులు జరిగి తాత్కాలికంగా నిలిచిపోయాయి. అన్నక్యాంటీన్ భవననిర్మాణానికి గాను ప్రభుత్వం రూ.40లక్షలు నిధులు కేటాయించినట్లు పర్యవేక్షణ ఇంజనీర్ తెలిపారు. కాగా 2026 నూతన సంవత్సరంలో గంగాధరనెల్లూరు మండల ప్రజలకు అన్న క్యాంటీన్ అందుబాటులోకి రానుంది.

శివాజీనగర్‌లో పిచ్చిమొక్కల తొలగింపు

● ఎమ్మెల్యే ఆదేశాలతో పారిశుధ్య పనులు



చిత్తూరు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను నగరపాలక పారిశుధ్య విభాగం అధికారులు తొలగించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు 17వ డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌కాలనీ, కృష్ణానగర్, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. శివాజీనగర్ వెనుకవైపున శ్మశానం పక్కనే ఉన్న డ్రైనేజీని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చలపతి, మేస్త్రీ బాబు, శానిటేషన్ సెక్రటరీ భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా అక్రమ నిర్మాణాలను తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని గాంధీరోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న కట్టడాలు, కాలువలపై నిర్మించిన కట్టడాలను తొలగించాలన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ నాగేంద్ర ఎక్స్‌కవేటర్ సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని తిరుపతి అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటరమణ పేర్కొన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా బుధవారం స్థానిక ఎన్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లడుతూ అవినీతి నిరోధంపై విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు పారదర్శకతతో వ్యవహరించాలన్నారు. దేశం ఉన్నత స్థితికి చేరుకోవాలంటే అవినీతి రహిత సమాజం రావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా కోయిల్ ఆల్వార్ తిరుమంజనం



నగరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని కరియ మాణిక్యస్వామి ఆలయంలో బుధవారం వైభవంగా కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించారు. వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ శుద్ధి చేపట్టారు. నవంబరు 4, 5న జరిగే పవిత్రోత్సవాల సందర్భంగా తిరుమంజనం నిర్వహించినట్లు టీటీడీ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, ధన్వంతరి ఆచార్యులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



మొరవ పారుతున్న మేళపట్టు చెరువు

నగరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 34 చెరువులు ఉన్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇందులో 17 చెరువులు మొరవ పారుతున్నాయి. దాదాపు అన్ని చెరువులు జలమయమై రైతులకు ఆనందాన్ని కల్పిస్తున్నాయి. చెరువులు నిండడంతో పంటల సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చెరువు కట్టలపై చెట్లు విపరీతంగా పెరిగి ఉన్నాయని, వాటిని తొలగించడానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

విజయపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మొంథా తుపాన్ దృష్ట్యా పారిశుధ్య చర్యలు నిర్వహించాలని ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. బూచివానత్తంలో సర్పంచ్ గోపాల్ పారిశుధ్య చర్యలు నిర్వహించారు. సురక్షితమైన తాగునీరు అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.